క్లుప్తంగా

గాజులతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంగునూరు(సిద్దిపేట): శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా పాలమాకుల వేంకటేశ్వరాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాజులతో అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ పేరుతో చేర్చుకోవద్దు



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తొగుట(దుబ్బాక): ఐదేళ్లలోపు పిల్లలను ప్రీ ప్రైమరీ పేరుతో ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకోవడం ఆపాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లు ఎంఈఓ నర్సయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ మద్దూరి వసంత మాట్లాడారు. ప్రీ ప్రైమరీ పేరుతో పిల్లలను పాఠశాలలో చేర్చుకోవడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య తగ్గిపోతుందని, వాళ్లలో పౌష్టికాహార లోపం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



ఫ్రీజర్ బాక్స్ అందజేస్తున్న రవీందర్‌గౌడ్

సిద్దిపేటఅర్బన్: తల్లి జ్ఞాపకార్థం మాజీ సర్పంచ్ బొల్లం రవీందర్‌గౌడ్ రూ.62 వేలు విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను శుక్రవారం ఎన్సాన్‌పల్లి పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మృతి చెందితే ఫ్రీజర్ బాక్స్ కోసం రోజుకు రూ.4 వేలు ఖర్చవుతుందన్నారు. గ్రామంలోనే ఫ్రీజర్ ఉంటే గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో అందజేసినట్టు తెలిపారు.

మట్టి సమస్య పరిష్కరించండి



కలెక్టర్ హైమావతితో మాట్లాడుతున్న మధు

బెజ్జంకి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న మట్టి సమస్యను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు శుక్రవారం బెజ్జంకిలో కలెక్టర్ హైమావతికి విన్నవించారు. స్థానికంగా లభిస్తున్న మట్టిని తరలించే ట్రాక్టర్‌లను అధికారులు ఆపకుండా చూడాలని కోరారు. అలాగే చిలాపూర్‌లో పాఠశాలలో అదనపు గదులు మంజూరు చేయాలని శానగొండ శ్రవణ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యతోనే సమస్యలకు పరిష్కారం: ఏఎస్ఐ



మాట్లాడుతున్న ఏఎస్ఐ మణెమ్మ

హుస్నాబాద్: సమాజంలో అన్ని సమస్యలకు విద్య ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఏఎస్ఐ మణెమ్మ అన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ మోసాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిస కావద్దని, ఇష్టపడి చదివితే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పని సరి

అక్కన్నపేట(హుస్నాబాద్): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరిస్తే ప్రాణానికి ముప్పు ఉండదని ఎస్ఐ చాతరాజు ప్రశాంత్ సూచించారు. మండలంలోని చౌటపల్లి క్రాసింగ్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సబంధిత పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ బ్రహ్మోత్సవాలు

- రేపటి నుంచి 8 వరకు ఉత్సవాలు
- కల్యాణ వెంకటేశ్వరస్వామిగా ప్రసిద్ధి
- ముస్తాబైన ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు





ఆలయ ముఖద్వారం, (ఇన్‌సెర్ట్‌లో) కొలువైన వెంకటేశ్వరస్వామి

దుబ్బాక: దుబ్బాకలో బాలాజీ ఆలయ నిర్మాణానికి చినజీయర్ స్వామి 2009 నవంబరు 1న భూమిపూజ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో పట్టణంలో రెండెకరాల స్థలంలో ఆలయం అద్భుతంగా రూపుదిద్దుకుంది. ఆలయానికి పది కోట్లకుపైగా దాతల విరాళాలు అందించారు. బాల్యంలో దుబ్బాకలోనే చదువుకున్న మాజీ సీఎం కేసీఆర్ ఆలయ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన 2015లో ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.3 కోట్లు , కామన్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) నిధులు రూ.1.25 కోట్లు మంజూరు చేయించారు.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు

కల్యాణ వెంకటేశ్వర స్వామిగా ప్రసిద్ధి చెందిన బాలాజీ ఆలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీ సహిత వెంకటేశ్వర విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అరవై అడుగుల ఎత్తయిన రాజగోపురం, మొదటి అంతస్తులో బాలాజీ స్వామి వారి విగ్రహం కుడివైపు పద్మావతి ఆలయం, ఎడమ వైపు గోదాదేవి ఆలయాలు నిర్మించారు. కింది భాగంలో ధ్యానమండపం, ఆలయం వెనుక భాగంలో కళావేదిక, కుడివైపు సేదతీరడానికి ఉద్యానవనం, పిల్లలకు కృష్ణవనం పేరుతో పార్కును ఏర్పాటు చేశారు. వృద్ధుల సౌకర్యార్థం లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేశారు. 500 మందికి సరిపోయేలా భోజనశాల నిర్మించారు.

రానున్న లక్షలాది మంది భక్తులు

బ్రహ్మోత్సవాలకు సుమారుగా 5 లక్షలకుపైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా. దుబ్బాక, సిద్దిపేట జిల్లాలో నుంచే కాకుండా హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరుకానున్నారు. అందుకు తగ్గట్టు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ప్రముఖులు రాక

బాలాజీ ఆలయ ఉత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

3వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

వెంకటేశ్వరస్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 8వ తేదీ వరకు ఆరు రోజులపాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 3న పుణ్యాహ వచనం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. 4న శాంతి పాఠం, యాగశాల ప్రవేశం, ద్వాదశ కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, 5న నిత్య, సుదర్శన, మూలమంత్ర జపహోమాలు, సాయంత్రం రాయబారం, ఎదుర్కోలు ఉత్సవం, 6న సాయంత్రం 6గంటలకు చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో వెంకటేశ్వస్వామి కల్యాణోత్సవం జరగనుంది. 7న సాయంత్రం రథాంగ హోమం, 8న మహాపూర్ణాహుతి, సామూహిక వరలక్ష్మీవ్రతాలు, సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఘనంగా ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. అనతి కాలంలోనే ఈ ఆలయం తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచడం చాలా ఆనందంగా ఉంది. ఆలయ నిర్మాణానికి మాజీ సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామి, ఆలయం శాశ్వత అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితోపాటు ఆలయ ట్రస్టు బాధ్యులు ఎంతో కృషిచేశారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవాలి.

– వడ్లకొండ శ్రీధర్, ఆలయ ట్రస్టు అధ్యక్షుడు

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి



బాలాజీ ఆలయం అనతి కాలంలోనే తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచింది. ఆలయం నిర్మాణంలో సీఎం కేసీఆర్ కృషి మరువలేనిది. ఆలయం నిర్మాణంలో పాలు పంచుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. బ్రహ్మోత్సవాలకు చినజీయర్ స్వామితోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– రొట్టె రాజమౌళి, ఆలయ ట్రస్టు ముఖ్య బాధ్యుడు

నానో యూరియా.. రైతుకు భరోసా

- పంట దిగుబడి అధికం
- మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ



అయినాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న వెంకట్రావమ్మ

కొమురవెల్లి(సిద్దిపేట): నానో యూరియాతో పంట దిగుబడి పెరిగి రైతుకు భరోసాగా నిలుస్తుందని మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ అన్నారు. మండలంలోని అయినాపూర్‌లో రైతులకు వరి, పామాయిల్ పంటల యాజమాన్య పద్ధతులు, నానో యూరియా వాడకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో యూరియా ద్రవరూపంలో ఉండే ఎరువు అని, మొక్కలకు అవసరమైన పోషకాలను మాత్రమే అందిస్తుందని చెప్పారు. సంప్రదాయ యూరియాతో పోలిస్తే ఎన్నో లాభాలు ఉన్నాయని, ఖర్చు కూడా చాలా తగ్గుతుందని వివరించారు. భూమిని సారవంతం చేసేందుకు రైతులు వానపాముల సాయంతో సేంద్రీయ ఎరువులను తయారు చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు భాస్కర్‌రెడ్డి, రవళి పాల్గొన్నారు.

ధర తక్కువ..

దుబ్బాక: అర లీటర్ నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమని, పైగా ధర కేవలం రూ.255 మాత్రమేనని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎరువుల దుకాణాలను సందర్శించారు. అనంతరం నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, ప్రత్యామ్నాయంగా నానో యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. దీనిని అన్ని రకాల గడ్డి మందులతో పాటు పురుగు మందులతో కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): డ్రోన్ ద్వారా పిచికారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అవసరమైన నత్రజని..

మిరుదొడ్డి(దుబ్బాక): నానో యూరియా వాడకం వల్ల నేలలో అవసరమైన మేర నత్రజని అందిస్తుందని, చీడ పీడలు నివారిస్తుందని మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ చెప్పారు. భూంపల్లిలో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

దౌల్తాబాద్(దుబ్బాక): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దీపాయంపల్లికి చెందిన దేవుడి పెంటారెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త రణం శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, జనార్దన్‌రెడ్డి, నాయకులు దుర్గేశ్, జయరాం రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

ములుగు(గజ్వేల్)/కొండపాక(గజ్వేల్): అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఇటిక్యాల రాములు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ములుగు మండలం మామిడ్యాల(ఆర్‌అండ్ఆర్ కాలనీ)కి చెందిన రాములు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, నాయకులు రాములు, సత్తయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిని యాదవరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, నాయకులు బాలబ్రహ్మం, కనకసేనాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

నామమాత్రపు పనులతో సాగుతున్న పాలన

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మహేశ్



మాట్లాడుతున్న మహేశ్

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నామమాత్రపు పనులతో పాలన కొనసాగిస్తూ అభివృద్ధిలో పరిపాలనలో స్వర్ణయుగం తెచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేశ్ విమర్శించారు. పట్టణ పరిధిలోని ఒకటో వార్డు లింగారెడ్డి పల్లిలో శుక్రవారం ఆయన మాజీ సర్పంచ్‌లు రామస్వామి, లక్ష్మి, మాజీ ఎంపీటీసీ బాలయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వార్డులో పదేళ్లలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. లింగారెడ్డిపల్లిలో బీఆర్ఎస్ కంచుకోటగా నిలబడ్డామని, నాయకులపై విషప్రచారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణవేణి, నరేశ్, పరశురాములు, కనకయ్య, వినయ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలల బతుకుల్లో చీకటిరోజు

రాష్ట్ర మాల మహానాడు పొలిట్‌బ్యూరో ఛైర్మన్ శ్రీరాములు



నిరసన తెలుపుతున్న నాయకులు

దుబ్బాక: మాలల బతుకుల్లో ఆగస్టు 1 ఒక చీకటిరోజు అని మాలమహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో ఛైర్మన్ ర్యాకం శ్రీరాములు అన్నారు. శుక్రవారం దుబ్బాకలో మాలలు నల్ల బ్యాడ్జీలు ధరించి బ్లాక్ డే పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అంశాన్ని తొల గించకుంటే వచ్చే ఎన్నికల్లో మాలలు ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల, మాదిగలను వేరు చేసి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర సోషల్ మీడియా బాధ్యుడు కాల్వ నరేశ్, దుబ్బాక అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కాల్వ లింగం, తునికి సురేశ్, ఆవ ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూరియా కొరతతో ఆందోళన

సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



మాట్లాడుతున్న మంద పవన్

సిద్దిపేటఅర్బన్: రాష్ట్రానికి రావాల్సిన యూరియా కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో శుక్రవారం జిల్లా, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన యూరియాను తక్షణమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అన్యాయమైన అర్హులను గుర్తించి తక్షణమే ఇళ్లు కట్టించి ఆదుకోవాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వ్యవహరించే ప్రభుత్వంపై నిరంతరం ఉద్యమిస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, దయానందరెడ్డి, సత్యనారాయణ, వనేశ్, అశోక్, భాస్కర్, జనార్దన్, శంకర్, రజని, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే చిన్నారులకు రక్ష

- పుట్టిన గంటలోపే పట్టించాలి
- సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి



చేర్యాలలో అవగాహన కల్పిస్తున్న నాగమణి

చేర్యాల(సిద్దిపేట): తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లులు విధిగా పాలు పట్టించాలని చేర్యాల సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి సూచించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే ఆహారంలో ఐరన్, కాల్షియం ఉండేలా చూసుకోవాలని, పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు తప్పనిసరిగా పాలివ్వాలని సూచించారు. తల్లిపాలు తాగకపోతే నీళ్ల విరేచనాలు, న్యూమోనియా, శ్వాసకోశ జబ్బులతో పిల్లలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే పాలివ్వడం వల్ల తల్లులకు రొమ్ము, అండాశయ క్యాన్సర్‌లు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని చెప్పారు. తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తాటిపాముల కృష్ణవేణి, హెల్పర్ రాజమణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): తల్లి పాలతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్‌లు శారద, తిరుమల అన్నారు. మండల పరిధిలోని గంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలు అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

సరిపడా యూరియా అందేలా చర్యలు

ఏడీఏ మల్లయ్య



మాట్లాడుతున్న ఏడీఏ మల్లయ్య

తొగుట(దుబ్బాక): రైతులు యూరియా కోసం ఆందోళన చెందొద్దని, సరిపడా యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏడీఏ మల్లయ్య తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటకు సరిపడా ఒకే విడతలో యూరియా తీసుకుపోవాలని రైతులు అడగడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించారు. నానో యూరియా వాడకం వల్ల మొక్కకు అవసరమైన మేరకే రసాయనాలు అందుతాయని, అలాగే పురుగు, కలుపు మందులు స్ప్రే చేసుకునే అవకాశముందని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ గంగారెడ్డి, ఏఈఓ రాజేశ్ పాల్గొన్నారు.

హామీలు అమలయ్యేది ఎప్పుడు?

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ములుగు(గజ్వేల్): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేశ్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు ప్రశ్నించారు. ములుగులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 19 నెలలు గడుస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీని ఇంత వరకు అమలు చేయలేదని మండిపడ్డారు. దివ్యాంగులకు రూ.6,016, వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు రూ.4,016 వరకు పెన్షన్ పెంచుతామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం లేదని, అంత్యోదయ కార్డులు మంజూరు చేయడంలేదని వాపోయారు. గజ్వేల్‌లో ఆదివారం నిర్వహించనున్న సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, రాజు, మహేశ్, రమేశ్, ప్రసాద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరుపై కాంగ్రెస్ నేతల హర్షం

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి శభాష్‌గూడెం వరకు 13 కి.మీ రోడ్డుకు రూ.30 కోట్లు మంజూరు చేయడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ కడవేర్గు, నాగపురి, పెద్దరాజుపేట, శభాష్‌గూడెం వరకు, ముస్త్యాల నుంచి వడ్లకొండ వరకు రూ.30 కోట్లతో మంజూరు చేసిన రోడ్డు నిర్మాణంతో ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాని, బాబు, శంకర్, లింగం, లీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ రమేశ్ సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉషారాణి ఉన్నారు.

◆ **బ్యాంక్ భవనం పరిశీలన**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో నూతనంగా నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ భవనం, ఫర్నీచర్ పనులను శుక్రవారం ఆ బ్యాంక్ జిల్లా సీఈఓ సత్యనారాయణరావు పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. త్వరలోనే బ్యాంక్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ప్యాక్స్ చైర్మన్ శరత్‌రావు, వైస్ చైర్మన్ రమేశ్, సీఈఓ వాసు పాల్గొన్నారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

నంగునూరు(సిద్దిపేట): ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దన్నపేటలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మాడలేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం శుక్రవారం రూ.50 వేలు, హనుమాన్ ఆలయంలో నీటి సౌకర్యం కోసం మరో రూ.10 వేలు అందజేశారు. ఆలయ కమిటీల సభ్యులు ఆయనను సత్కరించారు. పురేందర్, జనార్దన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రశాంత్, గణేశ్, పరశురాములు, మల్లేశ్, తిరుపతి, రాజు, సంపత్ పాల్గొన్నారు.

◆ **'రాజీవ్ యువవికాసం' అమలు చేయండి**

దుబ్బాకటౌన్: నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని బీజేపీ రాయపోల్ మండల అధ్యక్షుడు మంకిడి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గుర్రాల సోఫా చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన యువకులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, రాజుగౌడ్, గణేష్, నరేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఏపీఎంల బాధ్యతల స్వీకరణ**



వర్గల్(గజ్వేల్)/హుస్నాబాద్‌రూరల్/కోహెడ(హుస్నాబాద్)/అక్కన్నపేట(హుస్నాబాద్): వర్గల్, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట ఏపీఎమ్‌లుగా ఎం.కిరణ్‌కుమార్, తిరుపతి, గొడిశాల శ్రీనివాస్, సురేందర్ నియమితులయ్యారు. వారు శుక్రవారం తమతమ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మహిళా సంఘాలకు సక్రమంగా అందేలా కృషి చేస్తామన్నారు.